

రక్షణ చట్టాలు తీసుకురావాలి

వైద్యులందరికీ రక్షణ కల్పించడంతోపాటు వైద్య విద్యార్థులపై పని భారం తగ్గించాలి. వీరు ఏకధాటిగా 36 గంటలు డ్యూటీ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులకు పని ప్రదేశంలో విశ్రాంతి గదులు, రక్షణ కల్పించాలి. ఈ మధ్యకాలంలో ప్రైవేట్ ఆసుపత్రులపై దాడులు పెరిగాయి. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చట్టాలు తీసుకు రావాలి. అవి పక్కాగా అమలు చేయాలి.

–డాక్టర్ నెక్కంటి శ్రీనివాసరావు, పిల్లల వైద్యులు, ఐఎంఏ నిడదవోలు శాఖ అధ్యక్షుడు



సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనిసరి

ఆసుపత్రిలో కచ్చితంగా సీసీ కెమెరాలుండాలి. ప్రతి ఆసుపత్రిలో మహిళా సిబ్బందితో భద్రతా కమిటీ ఏర్పాటు చేయాలి. ఇరవై రోజుల క్రితమే దొమ్మేరు పీహెచ్‌సీలో ఏర్పాటు చేశాం. జిల్లా స్థాయిలో కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో నెల వారీ సమస్యలపై సమీక్షించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల ప్రాంగణంలో మహిళా వైద్య సిబ్బందిపై లైగింక దాడులు, భౌతిక దాడులు చేస్తే వేసే కఠిన శిక్షలు ఉండాలి.

–ఎస్.ధర్మరాజు, వైద్యాధికారి, దొమ్మేరు పీహెచ్‌సీ, కొవ్వూరు మండలం



వచ్చాడయ్యో.. సామీ!

- చవితికి ముస్తాబవుతున్న గణనాథులు
- సిద్ధం చేస్తున్న రాజస్థాన్ కళాకారులు
- వచ్చే నెల 7 నుంచి వేడుకలు

నల్లజర్ల: పూజలన్నింటికి ఆది దేవుడు, విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరు చవితి వేడుకలకు ముస్తాబవుతున్నాడు. వచ్చే నెల ఏడో తేదీ నంచి గణపతి నవరాత్ర ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది గణేశ్ వేడుకలకు మట్టి విగ్రహాలను వినియోగించాలని ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో ఉత్సవ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. నల్లజర్లలో ఇండియన్ బ్యాంకు పక్కన రాజస్థాన్ కళాకారులు చౌక్ మట్టితో విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఇక్కడ వినూత్న ఆకృతలతో గణనాథుడి విగ్రహాలను తయారు చేస్తున్నారు. వీరు విగ్రహాల తయారు చేసి అమ్మగా వచ్చే సొమ్ముతోనే బతుకుతున్నారు. వీరికి ఇవే ఆధారం. కుటుంబ పోషణకు రాజస్థాన్ నుంచి వచ్చి ఇక్కడ కష్టపడుతున్నారు. ఈ సందర్భంగా రాజస్థాన్ రాణాకపూర్ సాదర్‌కు చెందిన సోహన్‌లాల్ మాట్లాడుతూ పండగ ముగిసిన తర్వాత రెండు నెలలు స్వగ్రామానికి వెళ్లి వస్తామని, 10నెలల పాటు ఆంధ్రాలోనే ఉంటామన్నారు. మావద్ద ప్రస్తుతం చౌక్ మట్టితో తయారు చేసిన 200 విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. ఆకృతి సైజును బట్టి రూ.5 వేల నుంచి రూ.40వేల ధర వరకు ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉత్సవ కమిటీలు అడ్వాన్సులు ఇచ్చివెళ్లారు. వారికి నచ్చిన విధంగా విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నామన్నారు.



దేవరపల్లిలో పూజలందుకోవడానికి సిద్ధమైన వినాయకుడి విగ్రహాలు

పూజలకు సిద్ధం

దేవరపల్లి: గ్రామంలో దాదాపు పదేళ్ల నుంచి వినాయకుడి విగ్రహాలు తయారు చేస్తున్నారు. రాజస్థాన్‌కు చెందిన శిల్పులు ఇక్కడకు వచ్చి ఏటా విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. దేవరపల్లి పరిసర మండలాల నుంచి వినాయక చవితి నిర్వాహకులు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేసి తీసుకువెళతారు. గ్రామాల్లో చవితి ఉత్సవాల సందడి మొదలైయింది. ఆలయాల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాలకు రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు.



కొలువుతీరిన గణనాథులు



గణనాథుడి విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు అనిల్

ఆ యువకుడికి ఆటలంటే ఆసక్తి

తానున్నది గ్రామీణ ప్రాంతమైనా ఎంచుకున్న లక్ష్యంపై దృష్టి సారించాడా క్రీడాకారుడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణిస్తూ బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించాడు. దీనితోపాటు తనలాగే గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆశించాడు నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన గంటా దుర్గాశంకర్. కాని ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కొరవడిందని, కాస్త ప్రోత్సాహం అందిస్తే ఎంతో మంది క్రీడాకారులు తయారవుతారని చెబుతున్నాడు.

- జాతీయస్థాయిలో కరాటేలో స్వర్ణపతకం
- ప్రభుత్వ ప్రోత్సాహమే కరువు

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లికి చెందిన గంటా దుర్గా శంకర్‌కు చిన్నప్పటి నుంచి క్రీడలంటే మక్కువ. తనకు ఎంతో ఇష్టమైన కరాటే క్రీడపై దృష్టి సారించాడు. నల్లజర్ల ఎస్ఆర్‌కే కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూనే గతరెండేళ్లుగా గౌరీపట్నంలోని అరిగెల గోపినాథ్ వద్ద శిక్షణ పొందాడు. 24 స్టెప్స్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. ఇంతవరకు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్లలో పాల్గొని 20 సర్టిఫికెట్లు, నాలుగు మెడల్స్, రెండు ఐడెంటీ కార్డులు సాధించాడు.



బంగారు పతకం అందుకుంటున్న దుర్గాశంకర్

కుటుంబ నేపథ్యం

అతని తండ్రి మల్లికార్జునరావు తాపీ పని చేస్తాడు. తల్లి గృహిణిగా ఉంటున్నారు. చెల్లి ఎనిమిదో తరగతి చదువుతోంది. ఇటీవల తండ్రికి రోడ్డు ప్రమాదం జరగడంతో ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. కుటుంబ భారమంతా దుర్గా శంకర్‌పై పడింది. దీంతో డిగ్రీ ప్రైవేటుగా చదువుతూ ప్రస్తుతం ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. జాతీయ స్థాయిలో ఉత్తమ క్రీడాకారుడిగా పేరు తెచ్చుకున్న శంకర్ ఎలాంటి ప్రోత్సాహం లేక ముందుకు సాగలేకపోయాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ప్రోత్సాహం లేక అంతర్జాతీయ స్థాయికి వెళ్లాల్సిన శంకర్ ఉన్న ఊరిలోన మగ్గిపోతున్నాడు. ప్రభుత్వం లేదా దాతలు చేయూతనందిస్తే మరింత ఎత్తుకు ఎదుగుతానని, దేశ ఖ్యాతిని పెంచుతానని చెబుతున్నాడు కరాటే బ్లాక్ బెల్ట్ దుర్గాశంకరం.



దుర్గాశంకర్ సాధించిన పతకాలు, ప్రశంసాపత్రాలు

ఆకట్టుకున్న బాలకృష్ణులు

కొవ్వూరు: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలో గౌతమీనగర్‌లో పురుషోత్తమ రామ మందిరంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులు బాల కృష్ణుడి వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నంటున్నారు. రామనంద గౌడియ మఠం స్వామిజీ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఇంట్లో చిన్నారులకు శ్రీకృష్ణుడి జీవిత చరిత్ర, భగవద్గీత నేర్పించాలని సూచించారు. ఈ పోటీల్లో దేవర తన్వి శ్రీఅర్థ మొదటి బహుమతిని పొందగా పైడి హిమాన్షు రెండో బహుమతికి ఎంపికయ్యాడు. సంస్కార భారతీ రాష్ట్ర కార్యదక్షుడు టీఎస్‌వీ రమణమూర్తి, ఆంధ్రా గీర్వాణ విద్యా పీఠం ప్రిన్సిపాల్ గౌరీశంకర్ చిన్నారులకు బహుమతులు అందజేశారు.



కొవ్వూరులో కృష్ణుల వేషధారణలో చిన్నారులు

ఆలయం మేమే నిర్మించాం

నిర్మాణ కమిటీ సభ్యులు

తాళ్లపూడి: గోదావరి ఒడ్డున ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం తామే నిర్మించామని ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ నిర్మాణ దాతలు సంకాబత్తుల కుటుంబీకులు తెలిపారు. మండలంలోని వేగేశ్వరపురం గోదావరి ఒడ్డున గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సర్పంచు, ఆలయ నిర్మాణ దాతలు, గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్ర, నిర్మాణంలో ఇబ్బందులు వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు సంకాబత్తుల గంగారావు, సూరిబాబు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు మాట్లాడుతూ సుమారు 54ఏళ్ల క్రితం (1970)లో సంకాబత్తుల బ్రాహ్మణుడు నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో తాము 2019లో ఆలయం పునర్నిర్మించినట్లు తెలిపారు. దాతల సాయంతో సుమారు రూ.15 లక్షల వ్యయంతో ఆలయాన్ని పూర్తి చేసినట్టు తెలిపారు. ఈ ఆలయ నిర్మాణంపై మీసాల మునలయ్య ఇతర వ్యక్తులతో ఇప్పటికి 20 సార్లు ఫిర్యాదులు చేశారని, ఆలయానికి విద్యుత్ కనెక్షన్ సైతం తొలగించారని తెలిపారు. అయితే కోర్టు ఆదేశాలతో మళ్లీ అధికారులు కరెంట్ ఏర్పాటు చేశారన్నారు. ఆలయం కోసం రాజకీయాలు చేయడం మంచిది కాదని కమిటీ సభ్యులు అన్నారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు మాట్లాడుతూ గతంలో గ్రామంలోని టీడీపీ వర్గం వారు ఫిర్యాదుల కారణంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తన సోదరుడు వైఎస్సార్ సీపీ నాయకుడు దివంగత కొమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు, తాను అధికారుల చుట్టూ తిరిగి ఆలయంలో అన్ని వసతులు కల్పించామని తెలిపారు. గ్రామ పంచాయతీ తరపున తీర్మానం కూడా చేశారన్నారు. ఇది పోరంబోకు స్థలంలోనే ఉందని అధికారులు కూడా తేల్చారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ రావిపాటి లక్ష్మణరావు, నాటి తరం వృద్ధులు, గ్రామస్తులు, సకాబత్తుల రమణయ్య, తైలం పోశియ్య, ఎం.వెంకన్నబాబు, శూలా పోశియ్య, తైలం బాబ్జీ, తైలం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయం వద్ద సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్, గ్రామస్తులు

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం

తాళ్లపూడి: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవత సంస్థ ధ్యేయమని మానవత అధ్యక్షుడు అంకెం సురేష్ తెలిపారు. వేగేశ్వరపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల మానవత స్వచ్ఛంద సంస్థ నెల వారి సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో చేపట్టిన సేవా కార్యక్రమాలు, వచ్చే నెలలో చేపట్టే కార్యక్రమాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా పెద్దేవానికి చెందిన సిరిపల్లి భారతి కొవ్వూరులో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుంది. ఫీజులు నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయం మానవత అధ్యక్షుడు సురేష్ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రతినిధులు వి.చంద్రయ్య, జె.వెంకటేశ్వరరావు, సనపల రాజశేఖర్, గెద్దం సాయిబాబా, అప్పన హనుమంతరావు, పెమ్మాడి దుర్గాప్రసాద్, సాయన సుబ్బారావు, విశిష్ట దాత దుగ్గిరాల పూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గోపాలపురం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని మానవత చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక శర్వాణి హైస్కూల్‌లో సమీక్షా సమావేశం అనంతరం మండల మానవత అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ పారిశుధ్య నివారణ, పర్యావరణాన్ని కాపాడుకోకపోతే రేపటి తరం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటారన్నారు. ప్రతి విద్యార్థి తప్పకుండా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మానవత మాజీ అధ్యక్షులు సభ్యులు నెల్లి చంద్రశేఖర్, ముప్పన కృపాప్రసాద్, గెడ జోగేంద్రప్రసాద్, కె.నాగరాజు, ఉపాధ్యాయులు దేవి, నీలిమ, సుభాషిణి, కల్యాణి విద్యార్థులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో మొక్కలతో మానవత సభ్యులు

లెప్రసీ వ్యాధిపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని పిడింగొయ్యి గ్రామంలో మాజీ సొసైటీ వైస్‌చైర్మన్ తెల్లమేకల సూర్యకృష్ణ నివాసంలో బ్రెటర్ ఫీచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ రీజీమీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ఎంపీ, పీఎంపీలకు లెప్రసీ(కుష్టు) వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగనాథ్ కుష్టువ్యాధి లక్షణాలు, నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీలు గంధం వెంకటరత్నం, ఆర్.ఈశ్వర్‌ప్రభు, తోట వెంకటేశ్వరరావు, కొలూరి పాపారావు, వీరమళ్ల నాగరాజు, విత్తనాల శేఖర్ బాబు, బాబ్జి, వినీల తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో తొమ్మిది మంది అరెస్టు

కొవ్వూరు: దొమ్మేరు శివారు ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వారి నుంచి రూ.20వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. వాడపల్లి గ్రామంలో కోడి పందెలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రూ.500 నగదు, ఒక కోడి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జీపీఆర్ హైస్కూల్‌లో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈంద్రి ప్రేమ్‌కుమార్(60) ఆదివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. ఈ నెల 21న పాఠశాలలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఆయన రైల్వే స్టేషన్ వెనుక ఆవరోడ్‌లో కుక్కలు అడ్డురావడంతో బైక్ మీద నుంచి పడిపోయారు. గాయాలపాలైన అయనను ఆసుపత్రిలో చేర్చడంతో మోకాలిచిప్ప పగిలిందని శుక్రవారమే సర్జరీ చేశారు. అయితే శనివారం సాయంత్రం గుండె బరువుగా ఉందని చెప్పడంతో ఆయనను ఐసీయూలోకి మార్చారు. వైద్యం జరుగుతుండగా ఆదివారం ఉదయం గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రేమ్‌కుమార్ మృతిపై మండల విద్యాశాఖాధికారులు తులసీదాస్, చందుకుమార్, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, హెచ్ఎం నరసింహారెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు

ప్రకాశం నగర్: స్థానిక వైఎంవీఏ హాలులో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలురు, బాలికల చదరంగం పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో విష్ణుసాయి, అద్రిత్, త్రినాథ్‌కుమార్, కార్తికేయలు విజయం సాధించగా, బాలికల విభాగంలో రిషిత, అనన్య, నేహశ్రీ, తబ్బసమ్‌లు గెలుపొందారు.

క్లుప్తంగా

కోటసత్తెమ్మ తల్లి ఆలయంలో వేదసభ



వేదసభలో పాల్గొన్న పండితులు

నిడదవోలు రూరల్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పారావు శర్మ పర్యవేక్షణలో కోటసత్తెమ్మ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేదసభ నిర్వహించి పండితులను ఘనంగా సన్మానించారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.75,567 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రుద్రహోమం



కొవ్వూరు ఉమా చోడేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: పట్టణంలోని పాతూరులో ఉమా చోడేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. స్వామి వారికి రుద్రహోమం, అమ్మవారికి సూక్త విధానంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని విశేష అలంకరణ చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పట్టణానికి చెందిన కేశిరాజు వెంకటకృష్ణ కౌశిక్, ఐశ్వర్య, కేశిరాజు రవి నాగరాజ శ్రీనివాస్, శిరీష దంపతులచే పూజలు చేశారు. ఆలయ అర్చకులు కొతవరపు భాను, దేవరకొండ సాయి ప్రసాద్, ఉమా మహేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు.

భజన మండలి సభ్యులకు రూ.46 వేల వితరణ



భజనమండలి సభ్యులకు సాయం అందజేస్తున్న బాలకృష్ణ దంపతులు

నల్లజర్ల: స్థానిక ఓఎన్‌జీసీ రిటైర్డు ఉద్యోగి బుడిగిన బాలకృష్ణ తమ మనమరాలు బుడిగిన యిషిత మొదటి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం తమ ఇంటి వద్ద హనుమాన్ చాలీసా 108 సార్లు పారాయణం చేయించారు. జగన్నాథపురం సీతారామ భజన మండలి సమాజానికి కృతజ్ఞతగా రూ.46 వేలు (హార్మోనియం కొనుగోలుకు) చెక్కును భజన మండలి అధ్యక్షుడు సుబ్బారావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనం వెంకటసుబ్బయ్య, శ్రీమతి మైనం పద్మజ, సవలం రామకృష్ణ, పాముసాగదుర్గ, ఎ.రాజు పాల్గొన్నారు.

విద్యుత్ వైరు తెగిపడి గేదె మృతి



మృతి చెందిన గేదె

గోపాలపురం: విద్యుత్ వైరు తెగిపడి గేదె మృతి చెందిన సంఘటన దొండపూడి గ్రామంలో ఆదివారం జరిగింది. రైతు రుద్రం త్రిమూర్తులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం యథావిధిగా పొలంలో ఉన్న పాకలో గేదెను కట్టి రైతు ఇంటికి చేరుకున్నాడు. ఉదయం వెళ్లి చూడగా గేదెపై విద్యుత్ వైరు తెగిపడి ఉందని గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపాడు. దీని విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని నష్టపరిహారం ఇప్పించాలంటూ వేడుకుంటున్నాడు.

28న కొవ్వూరులో ఉచిత వైద్య శిబిరం

కొవ్వూరు: సంస్కృత కళాశాలలో ఈనెల 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ మెగా మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు తెలిపారు. షుగర్, బీపీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసీజీ ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. పింఛనుదారులు వారి కుటుంబ సభ్యులతో పాటు హెల్త్ కార్డున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఆరోగ్య శ్రీ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

అమరావతిలో పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేయాలి

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటు చేసి విగ్రహాన్ని స్థాపించాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామూర్తి అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి చిన్ని రామసత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ త్వరగా ఏర్పాటు చేసి చిన్న చిన్న కుటుంబాలకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్పొరేషన్ చైర్మన్లు, దేవస్థానాల ట్రస్ట్ బోర్డుల్లో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 50 వేల కిలో మీటర్లు పర్యటించి ఆర్యవైశ్యులను కలిసి సమావేశాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 365 పొట్టి శ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలను ఉచితంగా అందజేశానన్నారు. తొలుత వాసవీమాత చిత్రపటం, గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు రామసత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు వెలగా శ్రీరామూర్తి పూలమాలలు వేశారు. వాసవీమాత, జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామూర్తి మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టూరి కాశీవిశ్వనాథం, భీమవరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సభాపతి, పలువురు ఆర్యవైశ్య జిల్లా, రాష్ట్ర నాయకులు, మండలాల అధ్యక్షులు మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి నుదురుమాటి శ్రీనివాసరావు, అధనపు కోశాధికారి నారాయణ విశ్వేశ్వరరావు, శ్రీకాకొళపు కాశీకృష్ణ, ప్రగళ్లపాటి కాశీ, జిల్లా నాయకులు తీగెల బలరామయ్య, ఉపసర్పంచ్ వెలగా సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామసత్యనారాయణ